క్లుప్తంగా

రేపు బహిరంగ వేలం

తుక్కుగూడ: రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయం 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను కొబ్బరికాయల అమ్మకం, చీరలు, కొబ్బరి చిప్పలు, ఒడిబియ్యం సేకరణ, పలహారాల విక్రయాలకు గాను ఈ నెల16న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధర్యంలో నిర్వహించే ఈ వేలానికి ఆసక్తి ఉన్న వారు సకాలంలో హాజరుకావాలన్నారు. వేలము దక్కించుకున్న వారు వెంటనే 50 శాతం నగదు చెల్లించాలన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయాలి

హుడాకాంప్లెక్స్: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయాలని లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ సభ్యులు ప్రతిభ, రాయబండి శోభారాణి అన్నారు. గురువారం వారు సరూర్‌నగర్ డివిజన్ చెరుకుతోట కాలనీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ.. విద్యార్థులకు విరివిగా చాక్లెట్లు, పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్నామని చెప్పారు. అనంతరం పాఠశాలలో మౌలిక వసతుల సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆస్తి పన్నుతో మున్సిపల్ అభివృద్ధి

కమిషనర్ వెంకట్రామ్



రావిర్యాలలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వెంకట్రామ్

తుక్కుగూడ: ఆస్తిపన్ను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ కోరారు. గురువారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాలలో ఆస్తిపన్ను వసూలు డ్రైవ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. గృహ, వాణిజ్య, వ్యాపార, విద్యాసంస్థల నుంచి 2023–24 ఆర్థిక సంవత్సరం ఆదాయ పన్ను చెల్లింపుపై తాము అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ నెల 31వరకు ప్రతీ ఒక్కరు ఆస్తి పన్ను చెల్లించాలన్నారు.

సరూర్‌నగర్ ఠాణాను సందర్శించిన సీపీ



సరూర్‌నగర్ పోలీసులకు సూచనలిస్తున్న రాచకొండ సీపీ తరుణ్ జోషి

చైతన్యపురి: రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి గురువారం సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ సందర్శించారు. స్టేషన్‌లో నమోదవుతున్న కేసుల వివరాలు, రిసెప్షన్ పనితీరును ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యేందుకు పోలీస్ సిబ్బంది సమర్థవంతంగా పని చేయాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సీపీ వెంట ఎల్‌బీ నగర్ డీసీపీ శ్రవణ్‌కుమార్, ఏసీపీ కృష్ణయ్య వున్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా జంగయ్య గౌడ్

మంచాల: బీజేపీ మండల అధ్యక్షుడిగా ఆరుట్ల గ్రామానికి చెందిన పాండాల జంగయ్య గౌడ్‌ను నియమిస్తూ గురువారం జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చాడని తెలిపారు. కష్ట కాలంలో పార్టీ బలోపేతానికి కృషి చేశాడన్నారు. పార్టీకి ఆయన సేవలు మరింత అవసరమని గుర్తించి మండల అధ్యక్షుడిగా నియమించారన్నారు. అనంతరం జంగయ్య గౌడ్ మాట్లాడుతూ మండల అధ్యక్షుడిగా నియమించడంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

క్షీరాభిషేకం

తుర్కయంజాల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్యవైశ్యుల కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమని కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ అన్నారు. మున్సిపాలిటీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఆకుతోట శ్రీనివాస్ గుప్తా అధ్యక్షతన గురువారం తుర్కయంజాల్ చౌరస్తాలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మంగమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలనే కాకుండా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ రేణిగుంట రవీందర్, ప్రధాన కార్యదర్శి పంగిరి చక్రాధర్, కోశాధికారి యాదయ్య పాల్గొన్నారు.

పార్కింగ్ పరేషాన్!

- నిత్యం 200 ద్విచక్రవాహనాలు రోడ్డుపైనే..
- నిఘా లోపంతో బైక్‌లు మాయం
- సమస్య పరిష్కరించాలని వేడుకోలు



రోడ్డుపై పార్కు చేసిన బైకులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడకు వెళ్లేందుకు అల్మాస్‌గూడ, నాదర్‌గుల్, సాగర్ హైవే మీదుగా మూడు మార్గాలున్నాయి. ఇక్కడ నివసించే వారు సాగర్ హైవే రోడ్డును విరివిగా వాడుతుంటారు. గుర్రంగూడలోని పలు కాలనీల్లో నివాసం ఉంటున్న ఉద్యోగులు నిత్యం సాగర్‌హైవేపై ఉన్న ఫారెస్ట్ ప్రహరీ పక్కన బైకులు పార్కు చేసి వెళ్తున్నారు. నిత్యం సుమారు 200 బైకులు పార్కు చేస్తుంటారు. గుర్రంగూడ నుంచి హైవేకు సుమారు రెండు కిలోమీటర్లు ఉండడంతో బైక్‌పై వచ్చి ఇక్కడ పార్క్ చేసి మాల్, ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి, ఆమనగల్, కడ్తాల్, హైదరాబాద్ సిటీకి, ఎల్‌బీనగర్, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లో విధులు నిర్వర్తించేందుకు వెళ్తుంటారు. సాయంత్రం తిరిగి ఇంటికి చేరుకునేందుకు వెసులుబాటు లేక ఇక్కడ పార్కు చేయాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. సాగర్‌హైవే రోడ్డుకు ఆనుకుని ఉన్న గుర్రంగూడ మార్గంలో ఓ వైపు ఫారెస్ట్ భూమికి ప్రహరీ, మరోవైపు కంచె వేశారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్డుకు ఇరువైపుల బైకులను పార్కు చేస్తున్నారు. ఇక్కడ సీసీ కెమెరాల పర్యవేక్షణ లేక నాలుగైదు బైకులు చోరీకి గురయ్యాయి. ఫిర్యాదు చేసిన లాభం లేకుండా పోయిందని ఉద్యోగులు వాపోతున్నారు.

పార్కింగ్ సౌకర్యం కల్పించాలి



గుర్రంగూడ గ్రామంలోకి వచ్చే మార్గానికి ఇరువైపులా ఫారెస్ట్ ల్యాండ్ ఉంది. ఇక్కడ పార్కు చేస్తున్న బైకులకు భద్రత లేకుండా పోయింది. సీసీ కెమెరాలు లేవు. ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర ఏర్పాటు చేసిన కెమెరాలు సైతం పనిచేయవు. మధ్యాహ్నం తర్వాత జనసంచార లేక పోవడంతో బైక్ దొంగలు చేతివాటం చూపుతున్నారు. అధికారులు స్పందించి పార్కింగ్ సౌకర్యం కల్పించేదుకు తగు చర్యలు తీసుకోవాలి.

– పుట్టగళ్ల సంజీవ, మాజీ వార్డు సభ్యుడు, గుర్రంగూడ

పార్టీ పటిష్టతకు నిరంతర కృషి



సునీతకు నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

బీఆర్‌ఎస్ మహిళా విభాగం కార్పొరేషన్ అధ్యక్షురాలు సునీత

మీర్‌పేట: బీఆర్‌ఎస్ మహిళా విభాగం మీర్‌పేట్ కార్పొరేషన్ అధ్యక్షురాలిగా సమాల్‌పూర్ సునీత ఎన్నికయ్యారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సబితారెడ్డి ఆమెకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ.. కార్పొరేషన్‌లో పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు. తనపై నమ్మకంతో పదవికి ఎంపిక చేసిన ఎమ్మెల్యే, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, పార్టీ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఐడీ విచారణ జరిపించాలి

సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షుడు శంకర్



మాట్లాడుతున్న శంకర్ నాయక్

నాగోలు: రద్దు అయిన భూదాన్ బోర్డ్ పేరుతో గాంధీ భవన్‌లో కార్యాలయం పెట్టుకొని అక్కడి నుంచి భూదాన్ భూముల అక్రమ వ్యాపారానికి పాల్పడుతున్న బోర్డు మాజీ చైర్మన్ గున్న రాజేందర్ రెడ్డిని అక్కడి నుంచి తరిమేసి సీఐడీతో విచారణ చేయించాలని సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. సర్వోదయ మండలి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మహాసభ గురువారం నాగోలు సాయినగర్ కాలనీలోని సర్వోదయ మండలి కార్యాలయంలో మండలి మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కె. చందు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శంకర్ నాయక్ మాట్లాడుతూ, దేశంలోనే మొదటిసారిగా పోచంపల్లి గ్రామంలో వేదిరే రామచంద్రా రెడ్డి భూములను దానంగా ఇచ్చి, గ్రామాన్ని భూదాన్ పోచంపల్లిగా పేరు తెచ్చారన్నారు. భూదాన్ భూములు అన్యక్రాంతం, ఆక్రమణకు గురికాకుండా కాపాడేందుకు మరోసారి భూదాన్ ఉద్యమానికి సిద్ధం కావాలని ఆయన పిలుపు నిచ్చారు. మహాసభల్లో జిల్లా నాయకులు సహేదా బేగం, యాకూబ్ పాషా, ధనమ్మ , శ్రీనివాస్,. ఆరే కంటిరాములు, కొమ్ము యాదగిరి అచ్చలి, కమల, కొమ్ము రాములు తదితరులు పాల్గొన్నారు

చేవెళ్లపై కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం

- పార్లమెంట్ సెగ్మెంట్‌ను సోనియమ్మకు కానుకగా ఇద్దాం
- మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్

మహేశ్వరం: చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకుని సోనియమ్మకు కానుకగా ఇద్దామని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆయన మండల కేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్, బీజేపీ, బీఎస్పీలు ఒక్కటైనా అంతిమ విజయం కాంగ్రెస్ పార్టీదే అన్నారు. గత ప్రభుత్వ పాలనలో విచ్చలవిడిగా అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో ముఖ్యమంత్రి, అధికారులు, కార్యకర్తలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలకు పరిష్కారం చూపుతున్నారన్నారు. ప్రజా పాలనలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ఆరు గ్యారంటీలు ప్రజలకు వివరించి కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలను గెలిపించుకునే భాధ్యత తానే తీసుకుంటానని హామీ ఇచ్చారు. బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతం చేసి రానున్న ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకునేలా చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడే ప్రతీ ఒక్కరికి గుర్తింపు ఉంటుందని.. నామినేటెడ్ పదవుల్లోనూ తగిన ప్రాధాన్యం కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, మాజీ ఎంపీపీ కొరుపోలు రఘుమారెడ్డి, కాంగ్రెస్ మహేశ్వరం, కందుకూరు మాజీ మండల అధ్యక్షులు కాకి ఈశ్వర్, ఎస్.కృష్ణా నాయక్, మాజీ సర్పంచ్ కూన యాదయ్య, పార్టీ సీనియర్ నాయకులు వత్తుల రఘుపతి, శివగంగ ఆలయ చైర్మన్ అల్లె కుమార్, ఎస్టీ సెల్ సీనియర్ నాయకులు నేనావత్ రాజు నాయక్, మాజీ ఉప సర్పంచ్‌లు దోమ శ్రీనివాస్‌రెడ్డి, కర్రోళ్ల రాములు, లాజర్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌తో పేద ఆర్యవైశ్యులకు మేలు

ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

దిల్‌సుఖ్‌నగర్: ఆర్యవైశ్య కార్పొరేషన్‌తో పేద ఆర్య వైశ్యులకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా ఆర్య వైశ్య సంఘం నాయకులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించిన నేపథ్యంలో గురువారం ఆర్‌కేపురం డివిజన్‌లోని హరిపురి కాలనీలో రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, ఆర్యవైశ్య మహాసభ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి వెంకటేశం, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో ఏ ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి ఆర్య వైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తున్నదని అన్నారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి గందె సురేష్, కోశాధికారి బిల్లకంటి కిరణ్ కుమార్, అష్టలక్ష్మి ఆలయం మాజీ చైర్మన్ బంధం దామోదర్, అష్టలక్ష్మి ఆలయం ప్రధాన కార్యదర్శి అయిత అంజయ్య, శ్రీను బాకర్, మంచుకొండ సురేందర్, బిజ్జాల వేణు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతి



ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దండుమైలారం నేతలు, రైతులు

ఇబ్రహీంపట్నం: దండుమైలారం గ్రామ పంచాయతీ పరిధిలోని హఫీజ్‌పూర్ రెవెన్యూ రైతులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. కొన్నేండ్లుగా 620 ఎకరాల్లో సుమారు 400మంది రైతులకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్డీవో అనంతరెడ్డికి ఫోన్ చేసి వివరాలు తెలిపారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరేశ్, ఎంఆర్‌ఆర్ యువసేన, ముదిరాజ్ సంఘం నాయకులు రావణమోని లింగం, తాళ్లగూడెం నరేష్, కాకి పవన్, చీమల నాగేశ్వరరావు, రాసాల శ్రీశైలం, బిర్లా బాలప్ప, పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఆమనగల్లు: శెట్టిపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఇరువురు కుటుంబాలకు శెట్టిపల్లి మాజి సర్పంచ్ ఎగిరిశెట్టి సత్యం రూ.5 వేలు చొప్పున ఆర్థికసాయం అందజేశారు. శెట్టిపల్లి గ్రామానికి చెందిన కటుకూరి సాయిలు అనారోగ్యంతో, అదే గ్రామానికి చెందిన గడియ యాదమ్మ ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకొని ఇరువురి కుటుంబ సభ్యులకు గురువారం మాజి సర్పంచ్ ఎగిరిశెట్టి సత్యం పరామర్శించారు. అనంతరం ఆర్థికసాయం చేశారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

హయత్‌నగర్: అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం పసుమాములలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలను గురువారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సర్వే నెంబర్ 386లోని ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిసిన సమాచారం మేరకు తహసీల్దార్ రవిందర్‌దత్తు సిబ్బందిని అక్కడికి పంపించారు. దీంతో అక్కడ వెలిసిన అక్రమనిర్మాణాలను జేసీబీ సహాయంతో అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని ఆక్రమించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆలయానికి 'రాజకీయ రంగు'



దేవాలయం ఎదుట తొలగించిన షెడ్డు

పహాడీషరీఫ్: మామిడిపల్లి రంగ నాయకుల కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సిద్ధి రామలింగేశ్వర స్వామి ఆలయానికి రాజకీయ రంగు పులుముకుంటోంది. బీఆర్‌ఎస్‌కు చెందిన 12వ డివిజన్ కార్పొరేటర్ యాతం పవన్ కుమార్ యాదవ్ పర్యవేక్షణలో నిర్మిస్తున్న ఈ ఆలయ నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. ఇదిలా ఉండగా ఇటీవల శివ మాల ధరించిన భక్తులు సన్నిధానం(వసతి కేంద్రం) సౌకర్యార్థం బీజేపీకి చెందిన మాజీ కౌన్సిలర్ ఈరంకి వేణు కుమార్ గౌడ్ ఆలయ ఆవరణలో రేకుల షెడ్డును నిర్మించారు. రెండు రోజుల క్రితం ఈ షెడ్డును కార్పొరేటర్ పవన్ తొలగిస్తుండడంతో శివ భక్తులు అడ్డుకున్నారు. ఇది సరి కాదంటూ వాదనకు దిగారు. ఆలయం పక్కన ఖాళీ స్థలంలో షెడ్డును తిరిగి నిర్మిస్తామని, ఎదురుగా ఉంటే భక్తులకు ఇబ్బందిగా ఉంటుందని తొలగించాలంటున్నట్లు కార్పొరేటర్ వివరించారు. వద్దంటే ఇక్కడే కొనసాగిస్తానన్నారు. దీంతో ప్రస్తుతానికి వివాదం సద్దుమణిగింది. ఏదేమైనా స్థానిక వాట్సాప్ గ్రూప్‌లలో ఈ ఆలయ వివాదం చర్చనీయాంశంగా మారింది.

సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

విశ్రాంత ప్రొఫెసర్ గణేష్

దిల్‌సుఖ్‌నగర్: విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని విశ్రాంత ప్రొఫెసర్ సి.గణేష్ అన్నారు. యువతలో పెరుగుతున్న హింస ప్రవృతి కారణాలపై పరిష్కారాలు అనే అంశంపై నక్క వెంకటేష్ అధ్యక్షతన కొత్తపేటలోని బాబూ జగ్జీవన్‌రావ్ భవన్‌లో అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గణేష్‌తో పాటు ప్రొఫెసర్ జీబీ రెడ్డి, అడిషనల్ ఎస్పీ తిరుపతిరెడ్డి, విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ పెరిక యాదయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో విద్యార్థులు సోషల్ మీడియా ప్రభావం వల్ల ఎక్కువగా చెడిపోతున్నారని తెలిపారు. యువత సరైన మార్గంలో ప్రయాణించాలంటే క్రమశిక్షణ, చిత్తశుద్ధి, పట్టుదల చాలా ముఖ్యమని అన్నారు. సరైన మార్గదర్శనం లేకపోవడం వల్ల యువత వ్యసనాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్‌ను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గట్టు మల్లు, డాక్టర్ శివాజీ, మన అశోక్ యాదవ్, మేడి నాగరాజ్,శంకర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నివారణకు సీసీ కెమెరాలు దోహదం



మాట్లాడుతున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి, చిత్రంలో ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి తదితరులు

వనస్థలిపురం: ఒక సీసీ కెమెరా 100 మంది సిబ్బంది నిఘాతో సమానమని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని కమలానగర్ కాలనీ సంక్షేమ సంఘం భవనంలో సీసీ కెమెరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, మహిళలు, ప్రజల రక్షణకు, దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు, అవాంఛనీయ ఘటనల నివారణకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని అన్నారు. వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ, నేరాల నివారణకు సీసీ కెమెరాలు ఎంతో అవసరమని, ప్రతి కాలనీలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఏడుకొండలు, కాలనీ అధ్యక్షుడు టీవీ రావు, మాజీ అధ్యక్షుడు రాజ్‌కిరణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టండి

ఏవో రాజు



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏవో రాజు

తలకొండపల్లి: వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించి సస్యరక్షణ చర్యలు చేపడితే తెగుళ్ల బారినుంచి పంటలను కాపాడుకోవచ్చని ఏవో రాజు రైతులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని తిమ్మాపూర్ రెవెన్యూ శివారు భూముల్లో ఆయన పర్యటించి మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. మొక్కజొన్న పైరకు కత్తెర తెగుళ్లు వచ్చే అవకాశముందన్నారు. ఈ కత్తెర పురుగు పంటపై దాడి చేసి అపార నష్టాన్ని కలిగిస్తుందన్నారు. ఆకుల మీద పత్రహరితాన్ని గోకి తినుట వలన ఆకులపై తెల్లటి పొర ఏర్పడుతుందన్నారు. కాండం మొవ్వులో చేరి తినటం వలన విచ్చుకున్న ఆకుల్లో వరుస రంధ్రాలు ఏర్పడుతాయన్నారు. క్రమంగా మొవ్వను తినేయటం వలన మొవ్వు కత్తిరించినట్లుగా కనిపిస్తుందన్నారు. మొవ్వు లోపల ఉన్న పూత కూడా నష్టపోయి కంకి తయారవ్వదన్నారు. వీటి నివారణకు హిమాక్టిన్ బెంజోయేట్ ఎకరాకు 100 గ్రాములు మరియు డెల్టామేత్రిన్ డెల్టా మెత్రిన్ ఎకరాకు 100 ఎంఎల్ చొప్పున పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శిరిష, రైతులు పాల్గొన్నారు.

పాల బిల్లులు చెల్లించండి



ఆందోళన చేస్తున్న పాడి రైతులు

పాడి రైతుల సంఘం డిమాండ్

కడ్తాల్: పాడి రైతులకు సకాలంలో పాల బిల్లులు చెల్లించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రెండు నెలలుగా విజయ డెయిరిలో విక్రయిస్తున్న చిన్న, సన్నకారు రైతులకు బిల్లులు రావడం లేదని నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవలే పాడి రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని తెలంగాణ పాడి పారిశ్రామికాభివృద్ధి సహకార సమాఖ్య ఎండీతో సమస్యలు వివరించామన్నారు. మొదట ఒక బిల్లు 4 రోజుల్లో విడుదల చేయిస్తామని, తదుపరి బిల్లులు 20 రోజుల్లో ఇవ్వనున్నట్లు హామీ ఇచ్చిన విషయం గుర్తు చేశారు. నేటికీ బిల్లులు రాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రూ.200 కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేసి సకాలంలో అందజేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా గత ప్రభుత్వంలో 38 నెలలుగా లీటరు పాలకు రూ.4 ప్రోత్సాహకం ఇవ్వడంలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం లీటరు పాలకు రూ.5 ప్రోత్సాహకం కూడా 4 నెలలుగా ఇవ్వడం లేదని వారు తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి, పాడి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కడారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం స్థాయిని పెంచాలి



మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మాడ్గుల: మాడ్గుల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిని పెంచి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా ఏర్పాటు చేయాలని మాడ్గుల మాజీ సర్పంచ్ కాట్ల యాదయ్య గౌడ్, సుద్దపల్లి మాజీ సర్పంచులు నరసింహులు కోరారు. హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను గురువారం వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎప్పుడో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయి సరిపడక ప్రజలకు సక్రమంగా వైద్య సేవలు అందడంలేదని వారు పేర్కొన్నారు. పెరిగిన జనభాకు అనుగుణంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిని పెంచి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా ఏర్పాటు చేయాలని వారు వినతిపత్రంలో కోరారు. ఈ విషయంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.